క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: సంక్రాంతి సందర్భంగా విజయవాడ కనకదుర్గ అమ్మవారిని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి భూమి పూజ



పిల్లోనిగూడలో పాఠశాల భవనానికి భూమి పూజ చేస్తున్న సర్పంచు బుచ్చమ్మ, దాతలు

శంషాబాద్ రూరల్: దాతల సాయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవనానికి శనివారం భూమి పూజ చేశారు. మండలంలోని పిల్లోనిగూడలో నిర్మల్ ఫౌండేషన్ రౌండ్‌టేబుల్ ఇండియా సహకారంతో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచు బుచ్చమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాతలు అభిషేక్ అగర్వాల్, కె.బస్వాల్, కిషోర్ అగర్వాల్, సోనియా కర్మన్, అభిషేక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధకృష్ణ, ఉపసర్పంచు కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేసిన కోకాపేట కౌన్సిలర్లు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలో శనివారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, విజయ్‌బాబు, దుర్గేషయాదవ్‌లు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహిపాల్ రెడ్డి, నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు.. బహుమతుల ప్రదానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు రంగు రంగుల ముగ్గులను వేశారు. మొదటి బహుమతి కె.శ్రీలక్ష్మి (రూ.1000), ద్వితీయ బహుమతి శైలజ(రూ.800), మూడవ బహుమతి పూజ(రూ.500), 4వ బహుమతి స్వప్న(రూ.500)లు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.అమరేందర్, మాజీ అధ్యక్షులు నాగభూషణం, అప్పారెడ్డి గూడెం భీమయ్య... న్యాయనిర్ణేతలు పి.అరుణజ్యోతి, డాక్టర్ ఎస్.ఉషారాణి, డాక్టర్ ఆయేషలు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందచేసిన యూత్ క్లబ్ నిర్వాహకులు



మణికొండలో భోగి మంటలు వేసి హరిదాసు కీర్తనలు వింటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు



పుప్పాలగూడ గోల్డెన్ ఓరియాల్ గేటెడ్ కమ్యూనిటీ వద్ద వేడుకలు

భోగి మంటలు.. వేడుకలు

రాజేంద్రనగర్: భోగి పండగను రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు ఆనందోత్సాహాల నడుమ శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి పెద్దలు దీవించారు. యువకులు గాలి పటాలను ఎగరవేస్తు కనిపించారు. రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి, పీడీపీ చౌరస్తా, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్, రాంబాగ్ తదితర ప్రాంతాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడారాల్లో గాలిపటాలు, మాంజాలు విక్రయించారు.

మణికొండ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మొదటి రోజు ప్రజలు భోగి మంటలు వేశారు. పిల్లలపై భోగిపండ్లు పోసి, వేడుకలు చేసుకున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రజలు శనివారం తెల్లవారు జామునుంచే భోగి మంటలు వేశారు. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. మామిడి ఆకులు, పూలదండలు కట్టి శోభాయమానంగా తీర్చిదిద్దుకున్నారు. సంక్రాంతి పండగను సొంతూళ్లలో చేసుకునేందుకు అత్యధికులు తరలారు. మరికొందరు కోడి పందాలను చూడడానికి ఏపీకి తరలివెళ్లారు.



నార్సింగిలో..కౌన్సిలర్ ఉషారాణి



మణికొండలో.. గేటెడ్ కమ్యూనిటీ వాసులు



భోగి మంట వేస్తున్న చిన్నారులు

మేయర్ సంక్రాంతి శుభాకాంక్షలు



ఎంపి రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



మేయర్ మహేందర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బండ్లగూడ: ప్రజలు పండగలను సుఖసంతోషాలు, ఆనందోత్సవాల మధ్య చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయనను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాండు, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

రాజేంద్రనగర్: భోగి పండుగను పురస్కరించుకుని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డిని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి, మిద్దేల సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూల బొకే అందజేసి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

నిందితుడి అరెస్టు..

- రెండు కంప్యూటర్ పీసీలు స్వాధీనం

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ నుంచి కంప్యూటర్ పీసీలను తీసుకువెళ్లిన కాంట్రాక్టు ఉద్యోగి చంద్రశేఖర్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి రెండు కంప్యూటర్ పీసీలను స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ నేషనల్ పోలీస్ అకాడమీలో కాంట్రాక్టు పద్ధతిపై కంప్యూటర్‌ల నిర్వహణ చూస్తుంటాడు. ఇందులో భాగంగా మరమ్మత్తులకు గురైన వాటిని అక్కడే బాగు చేయడంతో పాటు ఇంటికి తీసుకువెళ్లి బాగు చేస్తుంటాడు. గత మూడు నెలల క్రితం ఎన్‌పిఏ ఔట్ పోస్టు రికార్డులో ఏడు కంప్యూటర్ పీసీలను తీసుకువెళ్లినట్లు నమోదై ఉంది. మూడు నెలలుగా చంద్రశేఖర్ విధులకు హాజరుకావడం లేదు. దీనిపై రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చంద్రశేఖర్‌ను శనివారం ఉదయం బాలాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. మద్యానికి బానిసైన చంద్రశేఖర్ విష్ణు అనే వ్యక్తికి కంప్యూటర్ పీసీలను అమ్మినట్లు తెలిింది. విష్ణు కోసం పోలీసులు గాలిస్తున్నారు. చంద్రశేఖర్‌ను సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

ఎక్స్‌ప్రెస్ వేపై యథేచ్ఛగా..

అనుమతి లేకున్నా పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు





రాజేంద్రనగర్: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనదారులు యథేచ్ఛగా ప్రయాణం చేస్తున్నారు. కేవలం కార్లకు మాత్రమే ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై అనుమతి ఉండగా కొందరు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ రద్దీ నుంచి తప్పించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. గతంలో సరోజినీదేవి కంటి ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11 కిలోమీటర్ల మేర భారీ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించారు. ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉంది. భారీ వాహనాలు, బస్సులు, ట్రక్కులు, ద్విచక్ర వాహనాలను నిషేధించారు. కానీ ప్రతి రోజు ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. 80–100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు అడ్డంగా వస్తుండడంతో అసౌకర్యం కలుగుతోంది. ప్రమాదాలు జరగక ముందే పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కార్ల యజమానులు కోరుతున్నారు.ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లో గతంలో ద్విచక్ర వాహనాలు ఈ ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణిస్తు మృత్యువాత పడ్డ సంఘటనలు గుర్తు చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సొడమ్మ జాతర ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో సొడమ్మ జాతర ప్రారంభమైంది. అమ్మవారికి శనివారం తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకంతో జాతరను ప్రారంభించారు. మొదటగా బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఐదురోజుల పాటు ఈ జాతరను నిర్వహిస్తారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. రాజేంద్రనగర్ పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.





అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

వైభవంగా గోదాదేవి కల్యాణం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడలోని శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజల్లో ఓం ప్రకాష్, రామ్‌చంద్రయ్య, తలారి ప్రేమ్‌కుమార్, రాఘవులు, రామారావు, రఘురాజ్‌గౌడ్, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాన్ని అందించేందుకు కొత్త కోర్సులు

- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు
- హెచ్‌సీయూ–టైమ్స్ ప్రో సంస్థల మధ్య ఒప్పందం



వీసీ బీజేరావు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

రాయదుర్గం: విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు కొత్త కోర్సుల నిర్వహణకు యత్నిస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో హెచ్‌సీయూ–టైమ్స్‌ప్రో సంస్థల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థుల కోసం కొత్త కోర్సులను అందుబాటులోకి తేవడానికి అవకాశం కలుగుతుందన్నారు. టైమ్స్ ప్రో సీఎఫ్ఓ అరుణ్‌కబ్రా మాట్లాడుతూ సవాళ్లను ఎదుర్కొవడానికి, కార్పొరేట్‌లలో ప్లేస్‌మెంట్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలుగుతుందన్నారు. మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమో ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, సీడీవీఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ జిలానీ, హెచ్‌సీయూ ప్రతినిధి డాక్టర్ లోకానందరెడ్డి, టైమ్స్‌ప్రొ ప్రతినిధులు కుల్‌దీప్ పరేక్, ఎంవిఆర్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులను ఆదుకోవాలి



అనాథ శరణాలయంలో చిన్నారులతో పెండ్యాల సాయిమాలిక్ తదితరులు

రాజేంద్రనగర్: అనాథ చిన్నారులకు అండగా నిలవాలని శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెండ్యాల సాయిమాలిక్ అన్నారు. సేవా సమితి కో చైర్మన్ పెండ్యాల ఆదిత్య జన్మదినాన్ని ఆరాధన బాలల అనాథ శరణాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు, స్టేషనరీ అందజేశారు. అనంతరం వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

సంక్రాంతి సంబురాలు





భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలలో నగరవాసులు పాల్గొని సరదాగా గడుపుతున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, జంగమదేవరలు సందర్శకులను అలరిస్తున్నారు. శనివారం భోగి పండగ సందర్భంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. దేబ్రసీ పట్నాయక్ శిష్యబృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శన ఇచ్చారు. డాక్టర్ కృష్ణకుమార్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గచ్చిబౌలి/రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో రంగనాథస్వామి, గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.ఎన్టీఆర్‌నగర్,గౌలిదొడ్డి, ఖాజాగూడ సాయివైభవ్‌కాలనీ, రాయదుర్గం, కొత్తగూడ, కొండాపూర్, ఇందిరానగర్, వినాయక్‌నగర్ వంటి ప్రాంతాలలోని ఆలయాల్లో అమ్మవారు, స్వామివార్లకు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

భోగి వేడుక

రాయదుర్గం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటిరోజును భోగి పండగ నేపథ్యంలో రాయదుర్గంలోని వ్యాయామశాల ముందు భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిఖిల్‌యాదవ్, రవి, అనిల్, సతీష్, అరుణ్, భద్రితో పాటు స్థానికులు పాల్గొన్నారు. ఇదేతరహాలో పలుచోట్ల భోగి మంటలు వేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

హఫీజ్‌పేట్ : భోగి పండగను పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రినగర్‌లోని శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

మియాపూర్: ధనుర్మాసం చివరిరోజు భోగి పండగను పురస్కరించుకుని శ్రీగోదాదేవి శ్రీరంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం 4.30గంటలకు మేలుకొల్పు హారతితో ప్రారంభమై ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం జరిపించారు. సుమారు 40 మంది దంపతులు వేడుకలో పాల్గొన్నారు.



కొండాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం







కళ తప్పిన రోడ్లు!



ఫిలింనగర్ రోడ్ నం.1

బంజారాహిల్స్: సంక్రాంతి పండుగ సందర్భంగా గడిచిన మూడు రోజులుగా నగరవాసులు పల్లెల బాటపట్టారు. దీంతో నగరంలో శనివారం నుంచే రోడ్లపై జనసంచారం తగ్గడంతో బోసిపోయి కనిపించాయి. నిత్యం రద్దీగా కనిపించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్ రహదారులపై వాహనాల రాకపోకలు తగ్గడంతో కళ తప్పాయి. కర్ఫ్యూ విధించారా అన్న రీతిలో రోడ్లు కనిపించాయి.